క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని రైతువేదికలో ఈ నెల 30న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సోమవారం ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10:30గంటలకు సర్వసభ్య సమావేశం ఎంపీపీ అశోక్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ రమణరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థినులకు అవగాహన



అయిజ: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో సోమవారం ఎస్‌ఓ చెన్న బసమ్మ ఆధ్వర్యంలో ఫీల్డ్ కోఆర్డినేటర్ రేణుక ఖత్రి వాయిస్ ఫోర్ గర్ల్స్ దిశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అత్యవసరమైన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్ణయాల గురించి తెలిపారు. బాలికలకు సంబంధించిన విద్య, హక్కులు, జీవన శైలి, ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తనుశ్రీ, సుస్మ, శిరీష, కేజీబీవీ సీఆర్‌టీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్మృతివనంలో వసతులు కల్పించండి



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో ఉన్న స్మృతివనంలో అన్ని వసతులు కల్పించాలని కోరుతూ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పార్కులో యోగాకేంద్రం, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, సీనియర్ సిటిజన్స్‌కు ఆవసరమైన సదుపాయాలను కల్పించాలని కోరారు. మోహన్‌రావు, రాఘవేంద్ర, సంధ్యా, రాధ, రాముడు, యూనుస్ తదితరులు ఉన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు



అయిజ: మండల కేంద్రంలోని మేడికొండ చౌరస్తాలో గ్రామాలకు వెళ్లే దారులను సూచించే బోర్డును స్వామి వివేకానంద యూత్ సభ్యులు సోమవారం ఏర్పాటు చేశారు. ఆర్ అండ్‌బీ అధికారులు మేడికొండ, పులికల్, నాగలదిన్నె, ఎమ్మిగనూరు, ఆదోని, బళ్లారి, మంత్రాలయంకు వెళ్లేదారులకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతుండడంతో బోర్డును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, వెంకటేష్, మారెప్ప, మహేంద్ర, వీరేష్, అనిల్, అంజి, రవి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు



గద్వాల అర్బన్: మార్చిలో నిర్వహించే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హృదయరాజ్ అధ్యాపకులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ జూనియర్ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ జిల్లా అసోసియేషన్ 711 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం ఎన్నికైన జిల్లా కమిటీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరన్న, అధ్యాపకులు పవన్‌కుమార్, రాజు, నర్సింహులు, గోవర్ధన్ శెట్టి, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో బీఆర్ఎస్ కార్యకర్త గోపాల్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గట్టు తిమ్మప్ప సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట జెడ్పీటీసీ రాజశేఖర్, సర్పంచ్ ఆంజనేయులు, గోపి, అజయ్ తదితరులు ఉన్నారు.

మైనార్టీ గురుకులం పిలుస్తోంది

- ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- వచ్చే నెల 6వ తేదీ వరకు అవకాశం



గద్వాలలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల

గద్వాల అర్బన్: ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉన్నత విద్యనందించాలనే లక్ష్యంతో మైనార్టీ గురుకులలను ప్రారంభించింది. ఇందులోనే విద్యార్థులకు భోజన సదుపాయంతో పాటు ఏకరూప దుస్తులను ఇస్తూ ఆంగ్ల మాధ్యమంలో ఉన్నత విద్యను అందిస్తున్నారు. కాగా 2024–25విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో 5తరగతిలోని మొత్తం సీట్లకు, 6, 7, 8వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు, కళాశాలల్లో ఆయా గ్రూపుల ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ఇందుకు ఫిబ్రవరి 6వ తేదీ వరకు గడువు ఉంది. జోగుళాంబ గద్వాల జిల్లాలోని పాఠశాలల్లో, కళాశాలల్లో కలిపి మొత్తం 320సీట్లు భర్తీ చేయనున్నారు. కాగా విద్యార్థులు వినియోగించుకుంటే ప్రయోజనం ఉంటుందని అధ్యాపకులు అంటున్నారు.

జిల్లాలో సీట్లు ఇలా..

జిల్లాలో గద్వాల, ఉండవెల్లి ప్రాంతాల్లో ఒక్కో పాఠశాల, ఒక్కో కళాశాల ఉంది. ఈ పాఠశాలల్లో 5వ తరగతిలో మొత్తం సీట్లకు, 6, 7, 8 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు దరఖాస్తులను స్వీకరిస్తుండగా, కళాశాలల్లోని ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సులకు దరఖాస్తులను స్వీకరిస్తోంది. గద్వాలలో మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలోని ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీలో 40, ఉండవెల్లిలోని కళాశాలలో సీఈసీలో 40 సీట్లు, హెచ్‌ఈసీలో 40 సీట్లు ఉన్నాయి. ఇక గద్వాలలోని పాఠశాలలోని ఐదవ తరగతి ప్రవేశాలకు 80 సీట్లు ఉండగా, ఉండవెల్లిలోని పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశానికి 80సీట్లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 6, 7, 8 తరగతుల్లో మిగిలిపోయి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సైతం దరఖాస్తు చేసుకోవచ్చాని ప్రిన్సిపాల్స్ చెబుతున్నారు. తరగతిలో సెక్షన్‌కు 40మంది చొప్పున విడదీసి తరగతులను బోధిస్తారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.



మానవపాడులో ప్రవేశాలపై ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు (ఫైల్)

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ప్రవేశం పొందే విద్యార్థులు tmreir.telangana.gov.inఅనే వెబ్‌సైట్ ద్వారా విద్యాభ్యాసంతో పాటు తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే విద్యార్థులు నేరుగా గద్వాల, ఉండవెల్లిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలి. ఆయా పాఠశాలలు, కళాశాలల్లోని సీట్లలో మైనార్టీలు (ముస్లిం, క్రిస్టియన్లు, పార్శీలు, బుద్ధులు, సిక్కులు) 75శాతం సీట్లు, నాన్‌మైనార్టీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు కలిపి 25శాతం సీట్లను భర్తీ చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వారికి రూ.2లక్షలకు మించకూడదు.

> **మెరుగైన విద్య**
>
> మైనార్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది. కార్పొరేట్ మాదిరిగా ప్రత్యేకంగా స్టడీ అవర్స్, పోటీ పరీక్షలకు అవసరమైన క్లాసులు సైతం నిర్వహిస్తున్నాం. నిర్ణీత ప్రమాణాలను అందజేస్తున్నాం. నిరంతరం విద్యార్థులకు చదువుపై పర్యవేక్షణ ఉంటుంది. ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
>
> – నవీత, ప్రిన్సిపాల్, మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, గద్వాల

ప్రభుత్వ భవనాలు ప్రారంభం



ఉండవెల్లి: మండలంలోని బొంకూరు పాఠశాలలో అదనపు గదిని, గ్రామంలో పల్లె దవాఖాన, మెన్నిపాడులో పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బబారన్న, శ్రీలత, నాయకులు పాల్గొన్నారు.

ఇతరులతో సభ్యతగా మెలగాలి

ఎర్రవల్లిచౌరస్తా: సభ్య సమాజంలో ఇతరులతో మంచి ప్రవర్తనతో మెలగాలని ప్రబోధా సేవా సమితి సభ్యులు సూచించారు. ఎర్రవల్లి మండలంలోని గార్లపాడులో త్రైతసిద్ధాంతం, ప్రబోధా సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సేవాసమితి ఎర్రవల్లి కమిటి సభ్యులు గ్రామంలోని ఇంటింటికీ తిరిగి భగవద్గీతలో ఉండే జ్ఞానంపై ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలోని ప్రజలకు భగవద్గీత గ్రంథాలను పంపిణీ కార్యక్రమంలో బీచుపల్లి, పరశురాముడు, వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, పావని, భాగ్యమ్మ, జయలక్ష్మి తదితరులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న సేవాసమితి సభ్యులు

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, సిబ్బంది

అయిజ: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని 7వ వార్డులో వివిధ కాలనీల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం లోపించిన పరిసర ప్రాంతాలను గమనించి వాటిని శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో తప్పకుండా రోడ్లను ఊడ్చాలని, డ్రైయినేజీల్లో ఎప్పటికప్పుడు మురుగును తొలగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

శాంతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందేలా కృషి చేయాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన మండల స్థాయి బాలల హక్కుల పరిరక్షణ వేదిక సమావేశం స్థానిక ఐకేపీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామస్థాయి బాలల హక్కులను కాపాడటం కోసం కృషిచేయాలని తల్లిదండ్రులు, సీఆర్‌పీఎఫ్ సభ్యులకు సూచించారు. బాల్య వివాహాలు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, నాగపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో శివుడు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయలు కొట్టి శివునికి ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.



ఉండవెల్లిలో..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలోని శివాలయంలో సోమవారం శివ మాలాధారులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును మార్చండి

అమరచింత: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డును మార్చాలంటూ 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగి వినోద్ మాట్లాడుతూ చెత్తను నిత్యం తగలబెట్టడం ద్వారా వస్తున్న పొగతో సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహించలేక పోతున్నామని వాపోయారు. అంతే కాకుండా కుళ్లిన వ్యర్థ పదార్థాలు, కోళ్ల వ్యర్థాలు, మృతి చెందిన జంతువుల కళేబరాలను తీసుకొచ్చి వాటిలో పారబోస్తుండడంతో దుర్గంధం వస్తుందని తెలిపారు. దీంతో నిత్యం దుర్వాసనతో పాటు పొగతో సావాసం చేస్తూ రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి త్వరగా డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరారు.

విద్యుత్ సమస్యలపై ఆరా

అయిజ: విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ భాస్కర్ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను ఏడీఈ గోవిందు, ఏఈ నరేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎక్లాస్‌పురం రోడ్డు సమీపంలోని బీసీ కాలనీకి ట్రాన్స్‌ఫార్మర్, కొత్త లైన్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా పట్టణంలోని వివిధ కాలనీల్లో గతంలో ఏర్పాటు చేసిన ఇనుప స్తంభాలను తొలగించి, సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ఎస్ఈ సూచించారు.

కోదండరాంను కలిసిన నాయకులు

గద్వాల అర్బన్: టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చిన నేపథ్యంలో సోమవారం ఆయనను హైదరాబాద్‌లో టీజేఎస్ జిల్లా జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని చిన్నోనిపల్లి భూ నిర్వాసితుల సమస్యలను రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో గోపాల్ రావు, రామచంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. ప్రసాద్ (56) గుండెపోటుతో అకాల మరణం చెందాడు. ఈ నెల 25వ తేదీన విధులు నిర్వహించి 27వ తేదీ ఉదయాన్నే ఆయన నివాసముంటున్న మహబూబ్‌నగర్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో 28న మధ్యాహ్నం అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్పీ ఆదేశాల మేరకు అలంపూర్ సీఐ రాజు సోమవారం మృతుడి స్వస్థలమైన వనపర్తి జిల్లాలోని చిట్యాలకు చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ వద్ద ఉన్న ఇండోర్ స్టేడియంలో ఈనెల 27, 28న నిర్వహించిన 2వ అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కొత్తకోటలోని గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన 30మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్లతో పాటు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్‌నబీ తెలిపారు. అండర్ 6 బాలుర కటాస్ విభాగంలో సాజ్‌అలీ, సాద్‌అలీ, అయాన్‌రెడ్డి వెండి పతకాలు, అండర్ 10 విభాగంలో లోకేష్, అక్షిత, అశ్విని, ముస్తాఫ్, వేణుప్రసాద్ బంగారు పతకాలు, అండర్ 12 విభాగంలో వైష్విక్‌తేజ, వేణు, నవ్య, నందన్, భానుప్రకాష్, సోహెల్, విజయ్‌కుమార్, దుర్గాప్రసాద్, ఎండీ హర్షద్, ఆర్.తరుణ్ బంగారు పథకాలు, రుమాన్, జయంత్‌రెడ్డి వెండి పతకాలు, అండర్ 7 కుమ్మితే విభాగంలో వెంకట్రావు బంగారు పతకం సాధించారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై పోరాటం

అలంపూర్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర హుసేన్ అన్నారు. అలంపూర్‌చౌరస్తాలోని కళాశాలలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి టీఎస్ ఎమ్మార్పీఎస్ నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మనిషి జీవితంలో చెప్పు, డప్పు భాగస్వామ్యంగా ఉంటాయన్నారు. గత ప్రభుత్వం కల్లు గీత, బీడీ, చేనేత కుల వృత్తుల కార్మికులకు పింఛన్ అందించిందన్నారు. అదేవిధంగా చెప్పు, డప్పు కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 29న చలో హైదరాబాద్ పోరుగర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని డప్పు, చెప్పు పారిశుద్ధ్య కార్మికులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బల్గెర హుసేన్

జిల్లా కమిటీ ఎన్నిక

జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కే హసన్, జిల్లా అధ్యక్షుడిగా మల్లెపోగు లక్ష్మన్, ఉపాధ్యక్షుడిగా కాశపోగు సుమన్, ప్రధాన కార్యదర్శిగా నరేష్, కార్యదర్శులుగా సుదర్శన్ , మందావిజిక్, నవీన్ కుమార్, నరసింహ, రవి, నాగన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అలంపూర్: విద్యార్థులు విద్యతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మానవపాడు మండల వైద్య విస్తరణ అధికారి సత్యనారాయణ అన్నారు. అలంపూర్‌చౌరస్తాలోని మహాత్మాజ్యోతి రావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో మానవపాడు పీహెచ్‌సీ వైద్యులు విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి మందులను అందించారు. ఈ సందర్భంగా మండల వైద్య విస్తరణ అధికారి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలన్నారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు షాజహాన్, వినోదిని, కృష్ణవేణి, ఆశాకార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని వినతి

రాజోళి: మండల కేంద్రంలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మకు సోమవారం వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలో తుంగభద్రనది ఉన్నప్పటికీ చుట్టు పక్కల గ్రామాల వారికి ఇసుక ఇబ్బందులు తప్పడం లేదని, అక్రమంగా ఇసుక రవాణా కావడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని తెలిపారు. వీటి పరిష్కారానికి నది వద్ద ప్రభుత్వం రీచ్‌ను ఏర్పాటు చేస్తే ప్రజలకు తక్కువ ధరకే ఇసుక లభిస్తుందని, కూలీలకు ఉపాధి లభిస్తుందని కోరారు.



వినతిపత్రం అందచేస్తున్న గ్రామస్తులు,కూలీలు

సామాజిక భద్రతకు పీఎఫ్ భరోసా



మాట్లాడుతున్న నోడల్ అధికారి రమేష్ చావా

అలంపూర్: విశ్రాంత ఉద్యోగులకు సామాజిక భద్రతకు పీఎఫ్ భరోసాగా నిలుస్తుందని జిల్లా పీఎఫ్ నోడల్ అధికారి రమేష్ చావా తెలిపారు. పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో నిధి ఆప్కే నిక్కట్ 2.0 వార్షికోత్సవాన్ని పురస్కరంచుకుని సోమవారం పీఎఫ్ ఖాతాదారుల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల రిటైర్మెంట్ తర్వాత మిగతా విశ్రాంత జీవితానికి ప్రావిడెంట్ ఫండ్ సంస్థ ఆసరాగా నిలుస్తుందన్నారు. పీఎఫ్ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం 'నిధి ఆప్కే నిక్కట్ 2.0' ఆవిర్భవించిందన్నారు. భవిష్య నిధి పథకం సభ్యులకు సామాజిక భద్రత కల్పించడంలో సాయపడుతుందని తెలిపారు. అనంతరం పలు సమస్యలపై అవగాహన కల్పిస్తూ పరిష్కరించారు. వీటితోపాటు ఈపీఎఫ్ యాక్ట్, పలురకాల పెన్షన్లు, ఈడీఎల్ఐ ఇన్సూరెన్స్‌పై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో సభ్యుల జీవన్ ప్రమాణ్ పంపించారు. కార్యక్రమంలో అధికారులు దీక్షిత్, పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

వీధి కుక్కలను తరలించండి



కేటీదొడ్డిలో రోడ్డుకు అడ్డంగా నిలబడిన కుక్కలు



పోలీస్‌స్టేషన్ వద్ద కుక్కల గుంపు

- వాహనాదారులను వెంబడిస్తున్న వైనం
- భయభ్రాంతులకు గురవుతున్న జనం

కేటీదొడ్డి: మండలంలో వీధి కుక్కలను నియంత్రించకపోవడంతో అవి జనాన్ని హడలెత్తిస్తున్నాయి. గ్రామలలో గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాలుర్ తిమ్మన్‌దొడ్డి, నందిన్నె, కొండాపురం, ఇర్కిచేడు, ఇతర గ్రామాలలో శునకాలు గుంపులుగా తిరుగుతూ వెంబెడిస్తున్నారు. గ్రామాలలోని ఏ వీధిలో చూసినా కుక్కల సంచారం అధికం కావడంతో మహిళలు, పిల్లలు భయంతో ఇళ్ల నుంచి బయటికి రావడం లేదు.

దాదాపు 200 వీధికుక్కలు

మండల కేంద్రంలో దాదాపు 200 వీధికుక్కలు ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. కుక్కల కారణంగా ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డుపై వెళ్తున్న కార్లు, ద్విచక్రవాహనాల వెంట పడుతున్నాయి. వాటి బారి నుండి తప్పించుకునే క్రమంలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పిన ఘటనలు ఉన్నాయి. రాత్రివేళ్లలో గ్రామంలో పిల్లలు వాటి అరుపులకు భయపడి నిద్రకూడా పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల క్రితం వీధి కుక్కలన్నీ గుంపులుగా చేరి గొర్రె పిల్లలను చంపి తిన్నాయని గ్రామస్తులు గుర్తు చేశారు. ఇళ్ల వద్ద పెంచుకున్న నాటుకోళ్లను, కోడి పిల్లలను సైతం అమాంతంగా ఎత్తుకెళ్లి తింటున్నాయని వాపోయారు. పంచాయతీ అధికారులు కుక్కల నుంచి రక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

> **కుక్కల బెడద నివారించాలి**
>
> 
>
> వీధికుక్కల బెడద తీవ్రంగా ఉంది. వీధుల వెంట గుంపులుగా తిరుగుతున్న కుక్కలు మనుషులు, పశువులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నాం. అధికారులు స్పందించి గ్రామంలో కుక్కల బెడద నివారించాలి.
>
> –రేణప్ప, కేటీదొడ్డి

> **కుక్కలను తరలిస్తాం**
>
> గ్రామంలో కుక్కల బెడద నివారించేందుకు ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కుక్కలను పట్టేవారిని పిలిపించి గ్రామం నుంచి బయటకు తరిలిస్తాం. గ్రామంలోని ప్రజలు భయందోళనకు గురికావాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటాం.
>
> – రంగన్న, పంచాయతీ కార్యదర్శి, కేటీదొడ్డి

బ్రిడ్జి పనులు ప్రారంభం



బ్రిడ్జి పనులకు మట్టిని తీస్తున్న యంత్రం

అయిజ: మండల కేంద్రం నుంచి మేడికొండకు వెళ్లే రోడ్డు మార్గంలో పోలోని వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు అధికారులు సోమవారం పనులు ప్రారంభించారు. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని ప్రాంతాలను కలుపుతూ నిర్మించతలపెట్టిన అంతర్రాష్ట్ర రహదారి ఆరేళ్లుగా నత్తనడకన నడుస్తుంది. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజ నరసింహకు ప్రజలు మేడికొండ రోడ్డు సమస్యలను విన్నవించడంతో పనులు వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. దాని ఫలితంగా తిరిగి పనులు ప్రారంభమయ్యాయి.